రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తాడేపల్లిలో ఏర్పాటు చేసిన సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఉదయం టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో పేషెంట్లకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతిరోజు సుమారు 150 మంది పేషెంట్లు సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారని వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, డాక్టర్ సురేష్, సిబ్బంది భాగ్యశ్రీ, గాయత్రి, షరీఫ్, బాలకుమారి, సురేష్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అన్నదానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటకల దుర్గాంజనేయులు, వెంకట మౌనికల కుమార్తె మంజూశ్రీ మొదటి పుట్టినరోజు సందర్భంగా మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న కార్మెల్ ఆశ్రమంలో మానసిక వికలాంగులకు అన్నదానం శనివారం జరిగింది. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశ్రమంలో మంచినీటి వసతి లేమిని గుర్తించి దానిని ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మురుగునీటి సరఫరా మరమ్మత్తుల నిమిత్తం మానవత చేపట్టనున్న కార్యక్రమాన్ని వై.రమణ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు టీవీ సాయిరాం, లక్ష్మీ సామ్రాజ్యం, శివాజీ, ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం: ఎస్సై

విశాలాంధ్ర-ఫిరంగిపురం : పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సై చల్లా కిషోర్ అన్నారు. శనివారం పోలీసుస్టేషన్‌లో పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను మరువరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైటర్ దేవదాసు, ఏఎస్సైలు శ్రీనివాసరావు, మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, రాజేష్, భాను, మురళీకృష్ణ, వేణు, గంగరాజు, మల్లేశ్వరి, హోంగార్డులు రవికుమార్, సుభాని, దానియేలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులను అపవిత్రం చేస్తున్న వైసీపీ..

విశాలాంధ్ర-పొన్నూరు : పవిత్రనిష్టతో నమాజ్ చదివి ప్రార్థనలు ఆచరించే మసీదుల్లో వైసీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలతో పాటు కార్యకలాపాలు సాగించటంపై పొన్నూరు నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి, న్యాయవాది షేక్ బాజీ సాహెబ్ ఖండించారు. శనివారం పట్టణంలోని మైనార్టీ సెల్ శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల వైసీపీ శ్రేణులు పొన్నూరు, నంబూరు మసీదుల్లో చేసిన ప్రసంగాలే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఫైరోజ్ ఖాన్, శిలార్ భాష, జానీ బేగ్, లాడెన్, కరీముల్లా బాజీ, మజీద, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మంచిగా మెలగండి

విశాలాంధ్ర, తెనాలి : సబ్ జైలులో ఉన్న ఖైదీల మంచి ప్రవర్తనతో మసలాలని జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ అన్నారు. కొత్తపేటలోని సబ్‌జైలును సందర్శించి ఖైదీలకు అందుతున్న వసతులు, వారి ఆరోగ్యం గురించి ఆరా తీసి తన సంతృప్తిని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ఎవరికైనా న్యాయవాది కావాలంటే న్యాయం కోసం మండల్ లీగల్ సర్వీసెస్ నుండి ఉచిత న్యాయసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది అప్పల కిషోర్, మండల లీగల్ సర్వీస్ నుండి మెహబూబ్ సరళ తదితరులు పాల్గొన్నారు.

బెంతో ఒరియాలకు అన్ని హక్కులు కల్పించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాజ్యాంగ బద్ధంగా బెంతో ఒరియాలకు కల్పించబడిన అన్ని హక్కులను కల్పించాలని ఆదిమ జాతి బెంతో ఒరియా సమాజ్ అధ్యక్షులు వేదవర బిసాయి ఒక ప్రకటనలో కోరారు. గిరిజనులకు ఏ రాయితీలు అయితే కల్పిస్తున్నారో అవి ఆదిమ జాతి బెంతు ఒరియా సమాజ్ కులాల వారికి కల్పించాలని అన్నారు. ఇచ్చాపురంలో ఆశ్రమ పాఠశాలలు మోడల్ స్కూల్స్ స్థాపించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ జాబితాలో 17వ వరుసలో బెంతో ఒరియా పేరు నమోదైందని అన్నారు. బహుజన ఉద్యమకారుడు గవ్వల ఓబులేసు మాట్లాడుతూ బెంతో ఒరియా సమాజ్ కులాల వారికి కుల సర్టిఫికెట్ ఇవ్వాలని అన్నారు. బెంతో ఒరియాలో మేధావులు చదువుకున్న విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. బెంతో ఒరియా హక్కుల సాధనకై బెంతో ఒరియల కలిసిరావాలని పిలుపునిచ్చారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం అర్బన్ పోలీసుల ఆధ్వ ర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. తహశీల్దార్ శ్రీనాథ్ కేదార్నాథ్ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగం పరిరక్షణ కోసం ప్రాణ త్యాగంతో సమాజానికి బంగారు బాటలు వేసిన పోలీసు అమరులు ఆదర్శనీయులని కొనియాడారు. సీఐ అల్తాఫ్ హుస్సేన్‌తో పాటు పోలీసు సిబ్బంది, నాయకులు పోలీసు అమరులకు నివాళులర్పించారు.

సీపీఐ సానుభూతిపరులు శేషగిరిరావు మృతి



విశాలాంధ్ర-మంగళగిరి : నిడమర్రు గ్రామంలోని సీపీఐ సానుభూతిపరులు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పత్తిపాటి శేషగిరిరావు(59) శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయన అంతిమయాత్ర ఆదివారం ఉదయం 10 గంటలకు వారి స్వగృహం నుంచి బయలుదేరుతుందని కుటుంబసభ్యులు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన అభిమానులు పాల్గొనాలని తెలియజేశారు.

రాహుల్‌ను కలిసిన మస్తాన్‌వలి

విశాలాంధ్ర-గుంటూరు : విజయభేరి బస్సు యాత్ర విజయవంతంగా ముగించుకొని ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో రాహుల్ గాంధీని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీసు అమరుల సేవలు మరువలేనిది : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో అశువులుబాసిన పోలీసు అమరుల సేవలు ఎప్పటికి మరువలేనిది, పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టు రోడ్డులోని పోలీసు అమరవీరుల స్మారక స్తూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, శాసన మండలి సభ్యులు లక్ష్మణ రావు, అడిషనల్ ఎస్పీ సుప్రజ, అసిస్టెంట్ ఎస్పీ నచికేట్ సెల్కి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నామన్నారు. జిల్లాలో గత ఏడాది పది మంది పోలీసులు తమ విధులు నిర్వహిస్తూ అమరులైనారని వారి త్యాగనిరతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుకుంటున్నానన్నారు. అడిషనల్ ఎస్పీ సుప్రజ మాట్లాడుతూ 1959లో భారత సరిహద్దులో దురాక్రమణకు పాల్పడుతున్న చైనా సైనికులతో మన దేశ బిఎస్ఎఫ్ జవానులు పోరాడిన సంఘటనలో పది మంది బిఎస్ఎఫ్ జవానులు అమరులైనారని, వారి త్యాగాలను స్మరిస్తూ అప్పటి నుండి ప్రతి ఏడాది అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మరణించిన పోలీసు వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించారు. పోలీసు త్యాగమూర్తులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, అడిషనల్ ఎస్పీ సుప్రజ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీలు చంద్ర శేఖర రావు, ప్రకాష్ బాబు, బాలసుందర రావు, మహబూబ్ బాషా, విజయ శేఖర్, సీఐ బాలసుబ్రమణ్యం, హైమారావు, సుబ్బారావు, శ్రీనివాస రావు, అన్వర్ బాషా, కోటేశ్వర రావు, అక్కేశ్వర్ రావు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలో దసరా పండుగను పురస్కరించుకుని విద్యార్థులు దాండియా, బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి అంటే కేవలం తొమ్మిది రోజులు చేసుకునే ఉత్సవం కాదని... స్త్రీ తత్వం తాలూకు మూడు పరిమాణాలైన దుర్గ, లక్ష్మి, సరస్వతిగా కొలిచే ఉత్సవమన్నారు. అమ్మవారిని పూజిస్తే సిరి సంపదలు సిద్ధించడంతో పాటు సుఖసంతోషాలు కలుగుతాయని చెప్పారు. అమ్మవారిలోని ధైర్యసాహసాలను మహిళాలోకం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నలుగురిలో కలవలేకపోతున్నామకునే విద్యార్థులకు నవరాత్రుల్లో చేసే దాండియా నృత్యాలు కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. స్నేహితులు, బంధువులతో కలిసి నృత్యం చేయడం, సంతోషంగా గడపడం వంటివన్నీ మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని విద్యార్థులకు తెలియజేసారు. మీరు ఎంచుకున్న నృత్యం ఏ రూపంలో ఉన్నా... అందరితో కలిసి ఆడుతూపాడుతూ ఉంటే మీలోనూ బృందస్ఫూర్తి పెరుగుతుందన్నారు. ఈ విధంగా నృత్యాలు చేయడం వల్ల శరీరం మొత్తానికి వ్యాయామంతో పాటు, గుండెకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ సంస్కృతి, సంప్రదాయాలను ఇదే విధంగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

విశాలాంధ్ర, తెనాలి : శనివారం తెనాలిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గాంధీచౌక్ నుండి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అమరులైన పోలీస్ సిబ్బందికి ఘననివాళులర్పించారు. అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. తెనాలి డిఎస్పీ జనార్థనరావు మాట్లాడుతూ అక్టోబర్ 21 పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవంను గత 64 ఏళ్ళుగా నిర్వహిస్తున్నామని విధి నిర్వహణలో అమరులైన పోలీస్ త్యాగాలను స్మరించుకుంటున్నామని ప్రజలంతా పోలీసులను మనసులో సెల్యూట్ చేసే రోజన్నారు. త్యాగనిరతితో బాధ్యతతో ఉండే పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంద న్నారు. విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సాంకేతికతకు తగ్గట్లు అప్‌డేట్ కావాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, సిఐ చంద్రశేఖర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, యస్.ఐ.లు, ఎన్‌సిసి విద్యార్థులు, ఆటో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వల్లూరి గంగాధరరావు చిరస్మరణీయులు

విశాలాంధ్ర, తెనాలి : పేదల కోసం, కార్మిక కర్షకుల, రైతాంగం, మహిళల కోసం నిరంతరం జీవితాంతం కృషి చేసిన మహానాయకుడు వల్లూరు గంగాధరరావు ప్రజల మనస్సుల్లో ఎల్లకాలం చిరస్థాయిగా నిలచిపోతారని వక్తలు నివాళులర్పించారు. తెనాలి ఎ.ఐ.టి.యు.సి. ఆధ్వర్యంలో శనివారం తెనాలి సి.పి.ఐ. కార్యాలయంలో వల్లూరి గంగాధరరావు 17వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సభకు ఎ.ఐ.టి.యు.సి., తెనాలి అధ్యక్షులు గురుబ్రహ్మం అధ్యక్షత వహించారు. సిపిఐ మాజీ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ గంగాధరరావు గారితో తన తండ్రి బొల్లిముంత శివరామకృష్ణ నాట నుండి అనుబంధ బాంధవ్యాలున్నాయని గుర్తు చేశారు. తెనాలి ప్రాంతంలో ఆయన జిల్లా కార్యదర్శిగా ఉన్న సమయంలో గ్రామాలలో సభకు హాజరయ్యేవారని, చదలవాడ, కాకర్లమూడి, కుచ్చెళ్ళపాడు గ్రామాలలో పార్టీ నిధి కోసం వరికోతలు, కుప్పలు వందలాడి కార్మికులతో కలిసి పనిచేసిన సంఘటనలు గుర్తుచేశారు. జిల్లాలో వ్యవసాయ కార్మికసంఘం, మహిళా, రైతు సంఘాల నిర్మాణం చేయించిన ఘనత వల్లూరికే దక్కుతుందన్నారు. తెనాలి కమ్యూనిస్టు పార్టీ కార్యాలయ నిర్మాణ ప్రేరణ ఆయనదేనన్నారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి తెనాలి ప్రాంత గ్రామాల్లో బొల్లిముంత, ఈదర సాంబశివరావు, యం.ఎల్.ఎన్.రావు, రామసుబ్బయ్యలతో కలిసి నిర్విరామ కృషిచేసిన ఘటనలను వివరించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితిలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచిన వల్లూరి ఆశయసాధన కోసం పార్టీని ముందుకు తీసుకెళ్ళాలన్నారు. సభా ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజానాట్యమండలి గాయకులు గేయాలను ఆలపించారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకూడదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు స్టార్ మస్తాన్, జాయింట్ సెక్రెటరీ షేక్ సుభానిలు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్టార్ మస్తాన్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను అన్యాక్రాంతం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తిరిగి ఆస్తులను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తుల చుట్టూ ఫెన్సింగ్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి ఆ స్థలాల్లో వక్ఫ్ ఆస్తులని నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటి వరకు వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం చేసిన వారిపై గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తూ అలసత్వంగా వహిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెండెం శ్రీనివాసరావు అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ అనే అంశంలో భాగంగా పేద బడుగు బలహీన వర్గాల కోసం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలలో ఒకటైన జగనన్న బడుగు వికాసం పారిశ్రామిక విధానంపై అవగాహన సమావేశాన్ని గుంటూరులోని ఒక హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలలో ఉన్న నిరుద్యోగ యువతకి స్వయం ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి వైపు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలను ఎలా వినియోగించుకోవాలో శాంతమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, డీసీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిశోర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సునీల్, ఇండియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాళికాదేవి అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు శ్రీ కాళికాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు టీఎల్వీ వీరాంజనేయులు, నేరెళ్ళ వెంకట హరిప్రసాద్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్.అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 102వ దసరా నవరాత్రి ఉత్సవాలు 7వ రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు.

క్వింటా పత్తి ధర రూ.6 వేలు

విశాలాంధ్ర-తాడికొండ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన పత్తి పంట చేతికొచ్చింది. కూలీలు పత్తి తీస్తున్నారు. పంట ఇంటికి చేరింది. క్వింటా పత్తి ప్రైవేట్ వ్యక్తులు రూ.6 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 7453 ఎకరాలలో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా 15 నుంచి 20 క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో పత్తి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ వారు మార్కెట్ యార్డ్ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ధర మరింతగా ఉంటే రైతులు లాభపడే అవకాశం ఉందని, ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి ఖర్చులు తడిసి మోపిడెగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ధర పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇన్ఫెక్షన్లపై అప్రమత్తత తప్పనిసరి:డా॥నాగకిషోర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పేషంట్ హాస్పిటల్‌లో జాయిన్ అయినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు ఇన్ఫెక్షన్స్ సోకకుండా ప్రివెంట్ చేయడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 3వ వారం ఇన్ఫెక్షన్స్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎంజీ నాగ కిషోర్ పేర్కొన్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుంటూరు ఒమేగా హాస్పిటల్ నందు వైద్య బృందం..నర్సింగ్..హౌస్ కీపింగ్ వారికి.. పేషంట్ హై రిస్క్ ఏరియాస్, ప్రొసీజర్, పల్మనాలజీ, గైనిక్, డయాబెటిక్, ఎకో, డైట్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ఇన్ఫెక్షన్స్ వంటి వాటితో మొత్తం 9 రకాల స్టాల్స్‌తో కూడిన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టాల్స్‌ను సందర్శించి అనంతరం ఆయన మాట్లాడుతూ రకరకాల ఇన్ఫెక్షన్ డిసీజ్‌లపై హాస్పిటల్‌లో కేర్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్యం పొందుతున్న పేషంట్‌కు ఇన్ఫెక్షన్ సోకకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు గురించి వైద్య విభాగం వారు అందించే సేవలు ఏవిధంగా ఉంటాయో చిన్న చిన్న ఆకృతులతో దృశ్య రూపంగా వివరించినట్లు చెప్పారు. హాస్పిటల్‌లో ఉన్న హౌస్ కీపింగ్ గానీ, నర్సింగ్ విభాగం గానీ, డాక్టర్స్ గానీ అందరూ నిత్యం ఇన్ఫెక్షన్ విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్ఫెక్షన్స్‌ను తగ్గిస్తే పేషంట్స్ రికవరీ రేటు చాలా తొందరగా జరుగుతుందని డాక్టర్ నాగ కిషోర్ తెలియజేశారు. పేషంట్ ఏ వ్యాధితో వచ్చారో దానిని క్యూర్ చేసి ఎలాంటి ఇన్ఫెక్షన్స్ సోకకుండా వారి స్వస్థలానికి ఆనందంగా పంపిచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.శ్రీకాంత్, డాక్టర్ డీవీఎన్ అరుణ, డాక్టర్ పి.హనీషా, డాక్టర్ మహతి, డాక్టర్ డి.శంకర్ మహదేవ్, డాక్టర్ ఎస్.ప్రతాప్‌కుమార్ రెడ్డి, డాక్టర్ పి.గీతా రుక్మిణి, డాక్టర్ సీహెచ్ దివ్య, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు డిమాండ్ చేశారు. ఎస్టీ యూ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షులు పెదబాబు ఆధ్వ ర్యంలో 'ఆర్థిక బకాయిల కోసం ఆక్రందన దీక్ష' పేరుతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు పెదబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న రెండు లక్షల మంది ఉపాధ్యాయుల ఆర్థిక సెలవు బకాయిలు రూ.700 కోట్లు, భవిష్యనిధి బకాయిలు, జీవిత భీమా బకాయిలు, కరువు భత్యం బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు మొత్తం కలిపి సుమారు రూ.15 వేల కోట్లు ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం చేర్చి తీరా అధికారంలోకి వచ్చాక జీపీఎస్ పేరుతో ఉపాధ్యాయులను ఉద్యోగులను మోసం చేయడం సమంజసం కాదని అన్నారు. దేశంలోని రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలో పాత పెన్షన్ అమలు చేయగా లేనిది ఈ రాష్ట్రంలో అమలు చేస్తే వచ్చే నష్టమేమిటో ఈ ప్రభుత్వం 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా మంజూరు చేయలేదని, ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఉన్న ఉపాధ్యాయ పోస్టులను జీవో నెంబర్ 117 పేరుతో రద్దు చేస్తూ, 3, 4, 5 తరగతులను విలీనం చేసి, ఈ విద్యా సంవత్సరంలో అకాడమీ కరికులం ప్రయోగాలతో కొంతకాలం బై జ్యూస్, మరికొంత కాలం సీబీఎస్ఈ, ఇటీవల టోఫెల్, ఐబీ తదితర ప్రయోగాలతో పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. రాష్ట్ర ఆర్థిక కమిటీ మెంబర్ వాసిమళ్ల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే 3.80 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలివేసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఆక్రందన దీక్షలో రాష్ట్ర కార్యదర్శులు అంబరీషుడు, కాకుమాను జోజప్ప, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్ ఉమా, రాష్ట్ర కౌన్సిలర్స్ కమతం శ్రీనివాసరావు, డీఏ జోసఫ్, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ ఎస్కే బాజి, జిల్లా కార్యదర్శి పెరేచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అవినీతి నిరూపించలేని సీఎం : కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాజకీయ కుట్రలో భాగంగా టీడీపీ అధినేత చంద్ర బాబును అరెస్ట్ చేసి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి అండ్ కో పైశాచిక ఆనందం పొందుతున్నారని, చంద్రబాబును అరెస్టు చేసి 43 రోజులు గడుస్తున్న కూడా ఇప్పటికి 1రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపిం చలేక పోయారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెల మూడి రవీంద్ర విమర్శించారు. శనివారం 20వ డివిజన్ లోని నల్లచెరువులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకి గ్యారెంటీ', బాబుతో నేను కార్యక్రమం నిర్వహిం చారు. కోవెలమూడి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌తో వైసీపీకి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. ఒక విజన్‌ను ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు మంచి గుర్తింపు ఉందని ఓర్వలేకే ఆయన పేరు ప్రతిష్టలకు భంగం కల్పించాలనే ఏకైక లక్ష్యంతో అరెస్టుకు సిద్ధపడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో ఈరెంటి వర ప్రసాద్, తన్నీరు కృష్ణ, మొహమ్మద్ రఫీ, జాఫర్, రబ్బానీ, ఇమ్రాన్, రహీమ్, కరిమునిస్సా, రాళ్లబండి, పుణుగుపాటి అంజనేయులు, గాలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెహబూబ్ షంషేర్ ఖాన్ స్విమ్మింగ్ పూల్ ట్రైల్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న నగరపాలక సంస్థ స్థలా లలో నేడు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఈ మెహబూబ్ షంషేర్ ఖాన్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణం జరిగిందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. స్త్రీ, పురుషులకు నిర్ణీత సమయాల్లో శిక్షకుల పర్యవేక్షణలో ఈ స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంటుందని, ఈ నెలాఖరు వరకు ఉచితంగా ప్రజలందరూ దీన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే నగర ప్రజలకు వారి ఆరోగ్యం కోసం ఎకో పార్క్ హిల్ ట్రెక్కింగ్ అందుబాటులో ఉన్నాయని, చిన్నారుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్‌లు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఇక నుంచి ఈత వేసేందుకు విజయవాడ పరిసర ప్రాంతాలకు వెళ్ళనవసరం లేదని, అతి తక్కువ రుసుంతో అందుబాటులో ఉండబోతుందని తెలిపారు. స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్, పవర్ లిఫ్టింగ్‌లతో పాటూ మరికొన్ని క్రీడలకు సంబంధించిన నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో మంగళగిరి నగరానికి ఈ ప్రాంతం ఒక స్పోర్ట్స్ హబ్‌గా మారబోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి పాల్గొన్నారు.

నేడు 'లీల కార్తికేయ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక కొత్తపేట శివాలయం ఎదురు సందులో ఆదివారం ఉదయం రాఘవేంద్ర హాస్పిటల్స్ వారి సౌజన్యంతో సువిశాలమైన ప్రాంగణంలో..అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 'లీల కార్తికేయ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం కానున్నట్లు ప్రముఖ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ వేమూరి నాగ శంకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ గ్రంధి అరవిందమ్, ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన స్ట్రోక్ ట్రీట్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పి. విజయ, మాజీమంత్రి, ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల అరుణ, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మేళ్లచెరువు సుబ్రహ్మణ్య శర్మ, సీనియర్ రేడియాలజిస్ట్, మస్కులో స్కెలిటల్ రేడియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా డాక్టర్ నాగవర ప్రసాద్, ప్రముఖ సీనియర్ జడ్జి పి.ఆదినారాయణ, గుంటూరు ప్రభుత్వ సమగ్ర హాస్పటల్(జీజీహెచ్)సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తదితరులు రానున్నట్లు డాక్టర్ నాగ శంకర్ తెలిపారు. మెదడు, గుండె సంబంధిత వైద్య సేవలు మా ప్రత్యేకత అని, పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే మా ప్రథమ కర్తవ్యమని అన్నారు.

శివాలయం ఫ్లోరింగ్‌కు రూ.5 లక్షల విరాళం

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లే శ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న చింతామణి ఫ్లోరింగ్ నిర్మాణానికి శనివారం స్థానిక వైఎస్ఎన్ సీ ఫుడ్స్ రూ.5 లక్షల విరాళం అందజేసింది. దేవాలయంలో సీ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ సింగంశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ మన్నవ సందీప్ రూ.5 లక్షల విరాళంను దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరెళ్ళ లక్ష్మి రాధికకు అందజేశారు. అనంతరం చైర్మన్ లక్ష్మీ రాధిక మాట్లాడుతూ దేవాలయంలో జరిగే చింతామణి ఫ్లోరింగ్‌కు రూ.5 లక్షల విరాళం ఇచ్చిన సీ ఫుడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానంలో సుమారు రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. రెండు కోట్ల రూపాయల వ్యయంతో చింతామణి ఫ్లోరింగ్ పనులతో పాటు గర్భాలయం, స్వామి వారి అంతరాలయం, ముఖ మండపం, విజయ గణపతి ఉపాలయం తదితర అభి వృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. దాతలు ముందుకు వచ్చి దేవాలయం అభివృద్ధిలో సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లి వెంకట బాబురావు, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-తాడేపల్లి : సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 14వ సచివాలయ పరిధిలోని కేఎల్ రావు కాలనీ, సీతానగరం ప్రాంతానికి సంబంధించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు పాల్గొని ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం గర్భిణీ మహిళకు అంగన్‌వాడీ కిట్టు అందజేశారు. అలాగే వైద్యం నిమిత్తం వచ్చిన రోగులకు ఉచిత మందులు కిట్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బిక్కిరెడ్డి శివారెడ్డి, పి.శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భవాని, ఆరోగ్య మిత్ర సూర్యనారాయణ, వైసీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, పట్టణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చిలుకోటి శ్రీనివాస మధు, జి.పద్మ, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

My son **KONDURU VENKATA GOPALA SIVA SAI PHANI RUTHWIK** S/o. K.V.P.S.R APPARAO shall henceforth be known as, **KONDURU PHANI RUTHWIK** S/o. **K.V.P.S.R APPARAO.**
K.V.P.S.R APPARAO Guntur, (No.138,Dt.17-10-2023, G.1050).

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఐటీడీపీ కోఆర్డినేటర్‌గా రాజు ఎన్నికపై హర్షం

విశాలాంధ్ర-అమరావతి : నిరంతరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేస్తూ ప్రజలతో మమేకమైన నియోజవర్గ తెలుగు యువత నాయకుడు నందూరి వెంకటస్వామి రాజును నియోజవర్గ ఐటీడీపీ కోఆర్డినేటర్‌గా ఎన్నిక చేయటాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులకు నియోజవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్‌కు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన నందూరి వెంకటస్వామి రాజుని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తరపున పెదకూరపాడు నియోజకవర్గంలో గెలుపే ప్రధానంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

వైద్యులకు ఘన సత్కారం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నిర్వహించి ఎనిమిది వేల మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేసిన డాక్టర్లను అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం స్థానిక ఎంపీపీ మేకల హనుమంతరావు యాదవ్, స్థానిక ఎంపీడీవో పి.ఉమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉన్నతాధికారులు, ఆయా గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : దసరా ఉత్సవాలు, దుర్గాష్టమి, ఆశ్రమ నిర్మాణ వ్యవస్థాపక ధర్మకర్త మఠాధిపతులు బ్రహ్మశ్రీ చింతాడ స్వప్రకాష్ గురూజీ జయంతి సందర్భంగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఆదివారం కుంకుమార్చన ఉదయం 10 గంటలకు జరుగునని ఆశ్రమ వంశ పారంపర్యం ధర్మకర్త మఠాధిపతులు లలితాంబ మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మహానివేదన మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగునని తెలిపారు. కుటుంబ సమేతంగా ఆశ్రమానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలనికోరారు. ఉదయం నుంచి భజన సంకీర్తలతో పాటు విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆమె తెలిపారు.

కౌశిక్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వ ర్యంలో ఆంధ్ర ఫుట్ బాల్ జట్టు అండర్-19 సెలెక్ట్ అయిన గంప కౌశిక్‌కి ఘన సత్కారం చేశారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ సత్తెనపల్లి నుంచి ఆంధ్ర రాష్ట్రం జట్టుకి ఎన్నికవ్వడం ఎంతో శుభపరిణామమని ఆంధ్ర తరఫున బాగా ప్రదర్శన ఇచ్చి సత్తెనపల్లి పేరు నిలబెట్టాలని కోరారు. మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇక్కడ నిర్వహించడం ఒక శుభపరిణామం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంప శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ ఆయుష్ వైద్య శిబిరం

విశాలాంధ్ర-నూజెండ్ల: మండలంలోని ములకలూరు గ్రామంలో శనివారం ఆయుష్మాన్ భవ కార్యక్రమం ఆర్. శ్రీనివాస్ ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయుష్ ఆరోగ్య మేళ ఎం.బి.రాజేంద్రకుమార్ కమిషనర్, డాక్టర్ పద్మజాతి ప్రాంతీయ ఉపసంచాలకులు ఆదేశానుసారము గ్రామంలో ఆయుష్ మేళ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 45 మందికి బిపి, షుగర్ పరీక్షలు చేసి ఆరోగ్యం పైన అవగాహన కలిగించి యోగా శిబిరం నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులకు, వాత వ్యాధులకు, రక్త చాపముకు , మధుమేహంనకు, ఆమ్లపితం వ్యాధికి ఆయుష్ మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త మరియమ్మ, సిబ్బంది గంగమ్మ, యోగా టీచర్ వెంకటాచారి పాల్గొన్నారు.

శివాలయంలో ప్రసాదాల పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పరిష్కరించుకొని శనివారం రాత్రి స్థానిక భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరేళ్ల లక్ష్మీ రాధిక హాజరై ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లి ముసలారెడ్డి, రేఖా వకుళా దేవి, కొల్లి వెంకట బాబురావు, అద్దంకి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు జుట్రూ ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, రెడ్డి రాఘవ, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేత గురుశంకర్‌కు సత్కారం

విశాలాంధ్ర-వినుకొండ: సౌత్ జోన్ 34వ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పరుగు పందెంలో నూజెండ్ల మండలం, ముక్కెళ్లపాడు యువ కుడు చంద్ర గురుశంకర్ విజేతగా నిలిచాడు. తెలం గాణ రాష్ట్రంలో జరిగిన సౌత్ జోన్ 400 మీటర్ల రిలే పరుగు పందెం పోటీల్లో రాష్ట్రం తరఫున పోటీ చేసి ద్వితీయ స్థానం సాధించాడు. చంద్ర గురుశంకర్‌ని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొంజేటి నాగ శ్రీను, జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం దుశ్యాలువా పూలమాల తో ఘనంగా సత్కరించి ఆర్థిక సహాయం అందజేశారు. వినుకొండ నియోజకవర్గ అధికార ప్రతినిధి పారేళ్ల అభిమన్యు మాట్లాడుతూ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో పతకాలు సాధించి జన్మభూమి పేరును దశదిశల చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల మండల ఉపాధ్యక్షులు రజిబాబు, వినుకొండ మండల ఉపాధ్యక్షులు గండికోట మణికంత, ప్రోగ్రాం కమిటీ మెంబర్ యాదాల వెంకటేష్, వినుకొండ టౌన్ అధ్యక్షుడు యూసఫ్ పటాన్, సీనియర్ నాయకులు తుమ్మ అనిల్, కుమార్, ఆశా మనోహర్ శివ, చిరంజీవి ,శశి కుమార్, సుభాని, అనిల్, సునీల్,నాగరాజు, ఉదయ్ కుమార్, హనుమాన్ నాయక్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్షకుల న్యాయం కోసం సీపీఐ పోరు: ముప్పాళ్ల

విశాలాంధ్ర-క్రోసూరు : ఉద్యమ స్ఫూర్తితో కర్షకులకు న్యాయం చేకూర్చే విధంగా పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలంలో పీసపాడు, ఎర్రబాలెం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు నష్టపరిహారాన్ని మొదట్లోనే అందజేయాలని, అదేవిధంగా ప్రతి ఒక్క రైతుకు బీమా సౌకర్యాన్ని అందేలా చర్యలు తీసుకోవాలని, పింఛను సౌకర్యాన్ని అమలుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్తి పంటకు గిట్టుబాటు ధరగా రూ.12 వేలు నిర్ణయించాలని, మిరప రైతుకు 50 శాతం సబ్సిడీతో పురుగుమందులను, మందు కట్టలను అందజేయాలని, ప్రతి ఊరిలో కూడా రచ్చబండల దగ్గర ప్రభుత్వ సబ్సిడీల పథకాలను తెలియజేసే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి సాగర్ ఆయకట్టు కాలువలకు నీరు అందే విధంగా వర్షాభావ పరిస్థితులు తట్టుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని దీనిపై అన్ని పార్టీలతో, ప్రజాసంఘాలతో రైతులను ఆదుకో వాల్సిన అవసరం ఎంతో ఉందని వెంటనే ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ముప్పాళ్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి : తాళ్లూరి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నియోజకవర్గంలో వర్షాలు లేక అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పల్నాడు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం చిలకలూరిపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు సరైన వర్షాలు లేని కారణంగా పంటలు రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటలపై ప్రత్యేక సర్వే నిర్వహించి రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా వర్షాలు లేనప్పుడు పంటలు పండేందుకు అవసరమైన నీటిని వివిధ మార్గాల ద్వారా అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పల్నాడు ప్రాంతంలో మరిముఖ్యంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రతి, మిరప పంటలను సాగు చేసిన రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారని అన్నారు. రైతులు పంటలు నష్టపోవటం వల్ల జరిగే పరిణామాలు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. కాబట్టి జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా పంట నష్టాన్ని అంచనా వేసి రైతులు అప్పులు పాలు కాకుండా వారికి ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీపీఐ కార్యదర్శి పేలూరి రామారావు, చిలకలూరిపేట నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చంద్ర కొండలరావు, సిపిఐ నాయకులు బొంతా భగత్ సింగ్ తదితరులున్నారు.

చంద్రబాబుకు మద్దతుగా వినూత్న నిరసన

విశాలాంధ్ర-నాదెండ్ల: తన 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల కోసం అంకి తం చేసిన చంద్రబాబు ఈ రోజు నిర్బంధంలో ఉండడంపై ప్రతి కుటుంబం ఎంతో ఆవేదన చెందు తోందని, ఆయన రాకకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తోందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అంతటా దసరా ఉత్సవాలు చేసుకుంటారు. అదేస్ఫూర్తితో చంద్రబాబు కూడా త్వరలో ఈ అక్రమ కేసులు, నిర్బంధాలను గెలిచి బయటకు రావాలని, ఆ రోజే రాష్ట్రానికి అసలైన దసరా వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. నాదెండ్ల మండలం గణపవరంలో శ్రీపతి అనే తెలుగుదేశం కార్యకర్త చంద్రబాబుపై ప్రత్యేక అభిమానం చాటుకుంటూ చేపట్టిన వినూత్న నిరసనలో ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే శనివారం గణపవరంలో కాట్రూ శ్రీపతి మనవరాలు శివజోషిత ఓణీల మహోత్సవం జరిగింది. జోషిత కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్తిపాటి చంద్రబాబుకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకుని సంఘీభావం తెలిపారు. బాబు కోసం మేము సైతం అంటూ పెద్దఎత్తున నినదించారు. చంద్రబాబు త్వరగా జైలు నుంచి విడుదల కావాలని ఆయనకు సంఘీభావంగా వినూత్నంగా నిరసన తెలిపినట్లు ప్రత్తిపాటి వెల్లడించారు.

చర్చీలో ప్రార్థనలు... లనాదెండ్ల మండలం లోని కనపర్రు గ్రామస్థలో సెయింట్ జోసఫ్ ప్రార్థన మందిరములో తెలుగు మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రబాబు క్షేమం విడుదల కావాలని యేసు ప్రభువుకు వేడుకున్నారు. కొవ్వొత్తులు వెలిగించి రాష్ట్రంలో చీకట్లు పోవాలని ప్రార్థించారు. చంద్రబాబు క్షేమంగా విడుదలై వచ్చే ఎన్నికల్లో భారీ విజయం సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గం లోని తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై కేసులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దసరా పండుగ సందర్భంగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులుపై చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో నిబంధనలను ఉల్లంఘించిన 45 బస్సులుపై కేసులు నమోదు చేయడం జరిగిందని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం అన్నారు. బస్సుల్లో సరుకులు చేరవేసినందుకు 17 కేసులు, ప్రయాణికుల వివరాల పట్టిక నిర్వహించనందుకు 6 కేసులు, ఇతర నిబంధనలు పాటించనందుకు 22 కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దసరా పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని కాంట్రాక్ట్ క్యారేజ్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని షేక్.కరీం వెల్లడించారు.

హాస్య నట చక్రవర్తి రాజబాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు సినీ వినీలాకాశంలో తనదైన హాస్య గుళికలు అలరించి విభిన్నమైన శైలిలో ఓ ప్రత్యేక ముద్రను వేసిన హాస్య నట చక్రవర్తి రాజబాబును తెలుగు వారెప్పుడు మర్చిపోరని హాస్య ప్రియులు, హాస్య వల్లరి కో-ఆర్డినేటర్ వివి రావ్ పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో రాజబాబు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివి రావ్ మాట్లాడుతూ తన నటనా వైదుష్యంతో సమాజంలో తోటి మనుషులకు సాయపడే ధర్మగుణంతో తన జీవితాన్ని సార్ధకం చేసుకున్న నవ్వులరేడు రాజబాబు అని కొనియాడారు. సినీరంగ విశ్లేషకులు పోతురాజు మాట్లాడుతూ హాస్యం బ్రతికున్నంత కాలం రాజబాబు ప్రేక్షకుల మదిలో చిరంజీవేనన్నారు. ఈ కార్యక్రమంలో పింగళి భాగ్యలక్ష్మి, కొండా శివరామిరెడ్డి, నారాయణ, అప్పారావు, నాగ ఫణిశర్మ తదితరులు ఉన్నారు.

కోట వెంకటసుబ్బమ్మకు ముప్పాళ్ల నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలోని మండిపూడి గ్రామంలో శనివారం సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ కోటా హరిబాబు మాతృమూర్తి కోట వెంకటసుబ్బమ్మ(84) మృతి చెందటంతో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, నాయకులు ముప్పాళ్ల శివశంకర్, ఎండ్రాయి గ్రామ సర్పంచ్ నాయుడు రాంబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబుని ముప్పాళ్ల నాగేశ్వరరావు ఓదార్చి సానుభూతిని వ్యక్తంచేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలయంలో మొదటి దశ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పునర్నిర్మాణ కార్యక్రమం కొండపైన శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి నిర్మాణ పనులు మొదటి దశ పనులను ప్రారంభించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినుకొండ పట్టణ ప్రజలు చిరకాల కోరిక మన శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు సంకల్పం, పట్టణ పెద్దల సహకారంతో ఈ పనులు శరవేగంగా ముందుకు వెళ్తున్నాయని అన్నారు. పట్టణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలని గౌరవ అధ్యక్షులు పెండ్యాల పుల్లారావు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పులిపాటి రామారావు, గాజుల మాల్యాద్రి, ట్రెజరర్ రెడ్డి నగేష్ బాబు, వైస్ చైర్మన్ గంధం బాలిరెడ్డి, అచ్యుత కృష్ణ, జాగర్లమూడి సుబ్బారావు, గజవల్లి నాగ పవన్, దండు చెన్నయ్య, ములకా రామ తులసి రెడ్డి, చందోలు మల్లికార్జున, గోవింద నాయక్, తేలికపల్లి బాబు, వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పేరిట వేల కోట్ల దోపిడీ

విశాలాంధ్ర-గుంటూరు : జగనన్న కాలనీల పేరుతో వైసీపీ నేతలు వేల కోట్లు దోచుకున్నారని టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు. స్థానిక నగర పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ దేశమంతా ఇళ్లు నిర్మించుకుంటూ రాష్ట్రంలో పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు కాదు... ఊళ్లు కడుతున్నాం అంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు ఆ విషయంలో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 21 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నామని నాలుగేళ్ల నుంచి చెబుతూనే ఉన్నారు. జగనన్న కాలనీలు అంటూ హడావుడి చేస్తున్నారే తప్ప ఏ ఒక్క పేదకుటుంబంతో అయినా సంతోషంగా గృహప్రవేశం చేయించారా అని నిలదీశారు. జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించారా? పైగా ఆ పేరు చెప్పి వేలాది కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఇవన్నీ దాచిపెడుతూ గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో కట్టిన ఇళ్లను పూర్తయినా సరే కావాలనే లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లుగా వైసీపీ నేతల జేబులు ఫుల్, పేదల కుటుంబాల్లో ఆనందం నిల్‌గా ఉందని అన్నారు.

పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-ఈపూరు: పాడిరైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఈపూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని కూచినపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈపూరు పశు వైద్యాధికారి పయ్యావుల శ్రీనివాసమూర్తి హాజరై మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ ప్రారంభానికి ముందు ఏజెంట్లు, మధ్యవర్తులు, ప్రైవేటు వ్యక్తులు పాల రైతులను దోపిడీ చేసేవారన్నారు. మహిళా పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు జగనన్న పాలవెల్లువ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మహిళ పాడి రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన అమూల్ డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే అమూల్ డైరీని బలోపేతం చేసేందుకు జగనన్న పాలవెల్లువ దోహద పడుతుందన్నారు. ఈ పథకంలో భాగంగా ఎలాంటి ష్యూరిటీలు లేకుండా మహిళ పాడి రైతులకు రూ.30 వేల వర్కింగ్ క్యాపిటల్ అందిస్తామన్నారు. ఎలాంటి ష్యూరిటీలు లేకుండా పాలు పోసే రైతులకు బ్యాంకు ద్వారా పాడి పశువుల కొనుగోలుకు రూ.1.6 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. పాడి రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడిరైతులకు పాడిసంరక్షణ, నిర్వహణ కోసం హామీలేకుండా గరిష్ఠంగా రూ.1.60 లక్షల వరకు వర్కింగ్ క్యాపిటల్ ద్వారా వచ్చిన రుణాలను పశువులు, సన్నజీవాలకు షెడ్లు, మంచినీటి తొట్టెల నిర్మాణం, తాళ్లు, ఇతర సామగ్రితో పాటు పశుగ్రాసం కొనుగోలకు ఈ రుణాలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ కార్డు పొందే పాడిరైతుకు బీమా సదుపాయం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పశువైద్యశాల సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన సమ్యక్ వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సమ్యక్ వేడుకలు ఘనంగా ముగిశాయి. డిజె ఆట పాటలతో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్‌ను వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో ఈ నెల 20 నుండి 21 వరకు నిర్వహించినట్లు సమ్యక్ చైర్మన్లు డాక్టర్ ఎ.శ్రీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాంకేతిక సదస్సుకు దేశ వ్యాప్తంగా ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన సుమారు 20వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సాంకేతిక సదస్సులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులతో పాటు విద్యార్థుల ప్రదర్శనలతో సంభరాలు అంబరాన్నంటాయన్నారు. విద్యార్థుల నాయకత్వాన్ని కనబరిచేలా విద్యార్థులే కమిటీలుగా ఏర్పడి సమ్యక్ అనే సాంకేతిక సదస్సును నిర్వహించారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ఒక బ్యాచ్ తరువాత మరో బ్యాచ్ వారసత్వంగా బావిస్తూ ప్రతీ ఏడాది సమ్యక్ అనబడే సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నారని అన్నారు. సమ్యక్‌కు చైర్మన్‌లుగా డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ బి.జయ కుమార్ సింగ్, సలహాదారులుగా డాక్టర్ ఎం.కిషోర్ బాబు, కన్వీనర్‌లుగా డాక్టర్ ఎం.సుమన్, డాక్టర్ టి.పవన్ కుమార్, డాక్టర్ అమరేంద్రలు కన్వీనర్లు, కో కన్వీనర్లుగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. కన్వీనర్ డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ ఇప్పటికీ వైభవంగా జరుగుతున్న సమ్యక్ కెఎల్ విద్యార్థుల ప్రజ్ఞ, పాటవాలకు నిదర్శనమన్నారు. విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసే అనేక ఈవెంట్‌ల ద్వారా ప్రత్యేకమైన అనుభవాన్ని ఈ సమ్యక్ సంభరాలు అందించాయన్నారు. సమ్యక్ నిర్వహిస్తున్న కెఎల్‌యు విద్యార్థుల కమిటీ సభ్యులు వినయ్ మాట్లాడుతూ ప్రాంతాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అనే తారతమ్యం లేకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విద్యార్థులందరూ ఒకే వేదిక మీద సమ్యక్ అనే పేరుతో సాంకేతిక పండుగను జరుపుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రోవిసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అన్ని విభాగాల డీన్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, చరిష్మ, ఆస్రిత తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా అడిగోప్పల అమ్మవారు

విశాలాంధ్ర-దుర్గి: దేవి శరన్నవరాత్రి మహోత్స వాల్లో భాగంగా నిదానం పాడులో వేంచేసియున్న మహాశక్తి పీఠం అడిగొ ప్పల శ్రీలక్ష్మీ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహ బాబు ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని 7వ రోజు శనివారం పలు రకాల స్వీట్లుతో అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు తరలివచ్చారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు కనులారా దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.అ ర్చకస్వాములు నేతృత్వంలో మహావిష్ణు, నవగ్రహ హోమాలు వైభవంగా జరిగాయి. పుణ్య దంపతులు పీటలు మీద కుర్చొని హోమక్రతులను తిలకించారు.

ఎస్ఐ రవీంద్ర బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్లో నూతన ఎస్ఐగా కె.పి.రవీంద్ర శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన క్రోసూరు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న సిహెచ్ సురేష్ బదిలీపై నరసరావుపేట డియస్‌బికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవీంద్రను పలువురు పోలీసులు కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొందేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యడ్లపాడు: తిమ్మాపురం గ్రామ సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై భవనం టెక్స్‌టైల్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఒక వ్యక్తి మరణించగా, మరో ఇరువురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. రోడ్డు దాటుతున్న మిల్లు కార్మికులు జి.నూకరాజు(24), సత్యజిత్‌సాహులను కార్మికులను గుంటూరు వైపు వెళ్లే బైక్ ఢీకొన్నది. బైక్‌పై ఉన్న వెంకట సూర్యతో సహా ఇరువురు కార్మికులు రోడ్డుపై పడిపోయారు. పడిపో యిన వారిపై వెనుకనుండి వస్తున్న కారు దూసుకెళ్లింది నూక రాజు అక్కడికక్కడే మరణించాడు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా పాడేరుకు చెందిన వాసి. భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయత్రీ దేవి అలంకారంలో వాసవీ మాత

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలో దేవీశరన్న వరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దసరా ఉత్సవాల్లో ఏడో రోజు శనివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రి దేవి అలంకారంలో వాసవీ మాత భక్తులకు దర్శనమిచ్చింది. పంచముఖాలతో ఉండే గాయత్రీ దేవి స్వరూపానికి ఎంతో విశిష్టత ఉంది.సకల మంత్రాలకు మూలశక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి చెందిన ఈ తల్లి ముక్తా, విద్రుమ, హేమ, నీలం, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ భక్తులను అనుగ్రహిస్తోంది. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన దేవతయైన గాయత్రీ దేవిని పూజిస్తే సకల ఉపద్రవాలు తొలగి, బుద్ధి తేజోవంతమవుతుందని భక్తుల విశ్వాసం.భక్తులు మహిమాన్వితమైన గాయత్రి మంత్రాన్ని జపిస్తూ సకల దేవతల ఆశీస్సులు పొందారు.శిరస్సు యందు బ్రహ్మ, హృదయమందు విష్ణువు,శిఖ యందు రుద్రుడు నివసిస్తుండగా త్రిమూర్త్యాంశంగా వెలుగొందుతున్న గాయత్రీ దేవి రూపాన్ని చూసి భక్తులు తరించారు. బంగారు, వంగ, ఆకుపచ్చ వన్నెల చీరల్లో కొలువుదీరిన అమ్మవారికి నైవేద్యంగా పులిహోర, కేసరి, పులగాలను సమర్పించారు. కాగా దుర్గ గుడిలో కనకదుర్గ అమ్మవారు పార్వతీ దేవి అలంకారంలో, సత్రశాల ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి దివ్యమంగళ రూపంలో భక్తుల పూజలందుకుంది.

ఉచిత పరిణయ వేదిక ప్రారంభం

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలం కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో శనివారం సరయు బ్రాహ్మణ పరిణయ వేదికను ప్రారంభించారు. వైబీవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వేదిక ప్రారంభ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు హాజరైనారు. ఎటువంటి రుసుములు, ఫీజులు లేకుండా ఉచిత సేవలను అందించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎవరైనా ఈ వేదిక వద్దకు వచ్చి తమ వివరాలను ఉచితంగా పొందుపరచుకోవచ్చునని, అలాగే రాష్ట్ర నలుమూలలకు చెందిన వధూవరుల వివరాలను ఈ వేదిక వద్ద ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. హాజరయిన సభ్యులు వేదిక పరిపాలక కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా వైవి రమేష్ బాబు, అధ్యక్ష కార్యదర్శులుగా వైబివి శ్రీనివాసరావు, చందవరం సరేంద్ర శర్మ, సహాయ కార్యదర్శిగా వంకాయలపాటి ప్రేమ కుమార్, మహిళా ప్రతినిధిగా బృందావనం లతా రాణి, సభ్యులుగా ఇరువురిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విశ్రాంత తహశీల్దార్ యడ్లపాటి బాలసుబ్రమణ్యం, పలు బ్రాహ్మణ సంఘాలకు చెందిన ఏకా మారుతి రామ శర్మ, పోలూరి రామచంద్రమౌళి, మైదఓలు శివరామకృష్ణ, పావులూరి శేషగిరిరావు, ఎల్ఐసీ కె వీ లక్ష్మీనారాయణ, పెళ్లూరి పవన్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

జన్మదినం జరుపుకోని వీరాభిమాని

విశాలాంధ్ర-తాడికొండ : అతను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వీరాభిమాని.... తెలుగుదేశం పార్టీ సభలు.... సమావేశాలు అన్న ఎనలేని అభిమానం. అతని పేరు మేడా రామకృష్ణ వయసు 34 సంవత్సరాలు గ్రామం కంతేరు. ప్రస్తుతం జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పార్టీలో కొనసాగుతున్నాడు. అక్రమ కేసులో ఇటీవల చంద్రబాబు అరెస్టు అయ్యి రాజమండ్రి సెంట్రల్ జైలులో జైలు జీవితం గడుపుతున్నాడు. అప్పటినుంచి ఏదో వెలితి..... ఏదో కోల్పోయినట్టు ఉంటున్నాడు..... ప్రతి ఏటా తన జన్మదినాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకుంటున్నాడు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం కంతేరు గ్రామ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించాడు. తన జన్మదినాన్ని వాయిదా వేసుకున్నాడు. చంద్రబాబు బయటకు వచ్చిన రోజే తాను జన్మదినంను జరుపుకుంటానని మొండిపట్టు పడుతున్నాడు.

పోలీసు అమరవీరులకు సలాం..!

- పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా సంస్మరణ దినోత్సవం
- స్థూపం వద్ద ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర - బాపట్ల : సమాజంలో శాంతి భద్రతలు పరిర క్షిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడటంలో పోలీసుల పాత్ర అమో ఘమైనదని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం శనివారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో స్మృతి పెరేడ్ ఘనంగా జరి గింది. పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యఅతిథిగా మోపిదేవి పుష్ప గుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. ఆర్.ఐ ఎల్.మన్మధరావు పెరేడ్ కామెండర్‌గా వ్యవహరిస్తూ ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించి పోలీస్ వాయిద్యా లతో స్మృతి పేరేడ్‌ను నిర్వహించారు. అమరవీరుల వివరా లతో ఉన్న షహీద్ పుస్తక్ టోలిని ఆర్ ఎస్ఐ సుధాకర్ అందించారు. అమర వీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులు నిర్వహించిన ప్రదర్శన ర్యాలీని మోపిదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీ నందిగం సురేష్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్, శాసనసభ మాజీ ఉపసభాపతి, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, శాసనమండలి సభ్యు రాలు పోతుల సునీత, బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, చీరాల నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి కరణం వెంక టేష్‌లు పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలతో ఘన నివాళులు అర్పించారు. ధైర్య సహసాలతో ప్రజా సేవ చేస్తూ అసాంఘిక శక్తులతో పోరాడుతూనే అసువులు బాసిన పోలీస్ వీరులను స్మరించుకుంటూ అతిథులు, సభికులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. షహీద్ పుస్తక్ టోలిలో వున్న అమరవీరుల పేర్లను రేపల్లె డీఎస్పీ టి.మురళీ కృష్ణ చదివి వినిపించారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 188 మంది తమ ప్రాణాలను కోల్పోయారని వారిలో ఒకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మృతి చెందారని వారికి శ్రద్దాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో రక్షణ శాఖ ఎలా పని చేస్తుందో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలు నెల కొల్పడానికి పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్గిల్‌వార్‌లో భారత సైన్యం త్యాగాలను మననం చేసుకోవల న్నారు.ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ విధి నిర్వహణలో లోపం లేకుండా, క్రమశిక్షణతో, త్యాగాలకైనా సిద్ధంగా ఉంటారని తెలిపారు. సాంకేతిక మార్పులతో ఏపీ పోలీస్ వ్యవస్థ అత్యద్భుతంగా సేవలందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

స్థూపం వద్ద మోపిదేవి,కలెక్టర్ రంజిత్‌బాషా,ఎస్పీ వకుల్‌జిందాల్, ఎంపీ నందిగం,ఎమ్మెల్యే కోన, ఎమ్మెల్సీ పోతల,కరణం,జేసీ శ్రీధర్, దేవినేని

కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షిం చడంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి అవి శ్రాంతంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సెల్యూట్ అంటూ ప్రశం సించారు. ఎండ, గాలి, వాన తేడా లేకుండా ఏటువంటి పరిస్థితుల్లోనైనా నిరంతరం చిత్తశుద్ధితో విధులు నిర్వ హించడం సాహసోపేతమన్నారు.

వీరుల త్యాగాలను స్మరిస్తూ శోకసస్త్ర నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

పోలీసులు తమ కుటుంబం, వ్యక్తిగత జీవితాన్ని మరచి ప్రజల ప్రాణాలకు అండగా నిలుస్తారని కితాబిచ్చారు. ఏపీలో నక్సల్స్‌ను పూర్తిగా నిర్మూలించడంలో పోలీసుల కృషిని ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ నేడు దేశానికే దిక్సూచిలా మారిందన్నారు.

పాతబస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడిన పోలీసులు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లా డుతూ 1959వ సంవత్సరం, అక్టో బర్ 21వ తేదీన భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడక్ ఆక్సాయిచిన్ వద్ద విధులు నిర్వహిస్తూ 10 మంది పోలీస్ సిబ్బంది దేశం కోసం అమరులయ్యారన్నారు. అప్పటి నుండి ప్రతీ ఏటా అక్టోబర్ 21వ తేదీ పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పోలీస్ ఉద్యోగం చాలా క్లిష్టమైన దని, రాత్రి, పగలు, ఎండ, వాన తేడా లేకుం డా చేసే ఏకైక ఉద్యోగమని, ఇతర ఉద్యోగా లతో పోలిస్తే పోలీ సులు ఎక్కువగా కష్టపడతా రన్నా రు. ఏదైనా ప్రాంతం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే అక్కడ శాంతి భద్రతలు అదు పులో ఉండాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించుటలో, విద్రోహ శక్తులను నియంత్రించ డంలో పోలీస్ శాఖ భూమిక చాలా కీలకమైనదన్నారు. మన రాష్ట్రంలో నక్సలిజం పూర్తిస్థాయిలో తగ్గిపోయిందని, అది పోలీస్ అమరవీరుల త్యాగఫలమేనన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది సరైన సౌకర్యాలు లేకపోయినా, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తిన వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ ఉంటారన్నారు. విధి నిర్వహణలో ప్రాణా లు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. పోలీసుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చెప్పారు. బాపట్ల జిల్లా నూతనంగా ఏర్పడినప్పటికీ శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసుల కృషిని అభినందించారు. రోడ్డు ప్రమాదాలు 40 శాతం తగ్గాయన్నారు. ప్రధానంగా నాటు సారా, గంజాయి విక్రయాలపై ఉక్కు పాదం మోపి పూర్తిగా అరికట్టామన్నారు. పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్‌లో 26 మంది ప్రాణాలను పోలీసులు కాపాడారని తెలిపారు. జిల్లాలో పోలీ సుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది శాఖ పరమైన సమస్యలను పరిష్కరించడా నికి ప్రతి నెలలో ఒకరోజు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందికి, దూర ప్రాంతాల నుండి పోలీస్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే పోలీస్ సిబ్బందికి తక్కువ ఖర్చు లో నాణ్యమైన భోజనాన్ని, అల్పాహారాలను అందించే విధం గా పోలీస్ వనభోజనశాల ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షల నిమిత్తం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ శాఖలు వాహన డ్రైవర్లుగా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఇటీవల కంటి పరీక్షలను నిర్వహించామన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన పోలీస్ సిబ్బంది యొక్క కుటుంబ సభ్యుల సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బం దికి తాగునీరు అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. చదువులలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బంది పిల్లలు 31 మందికి 5.5 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్ అందించామన్నారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు, యాసం మస్తాన్‌బాబు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి అతిధుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. పోలీసు సిబ్బంది ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ పాతబస్టాండ్ వరకు వెళ్లి మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎమ్. డి.హెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాద్‌రావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ రమణ, ఎస్.బి సిఐ వి.సూర్యనారా యణ, ఆర్.ఐ. ఎల్.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఆర్డీవోగా హేల షారోన్ బాధ్యతలు

విశాలాంధ్ర - రేపల్లె : రెవెన్యూ డివిజన్ నూతన ఆర్డీఓ గా బి.ఎస్.హేల షారోన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన జగన్నాథం పార్థసారథి బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో షారోన్ బాధ్యతలు తీసుకున్నారు. 2022 గ్రూప్ వన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవోను తాసిల్దార్ శ్రీచరణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రేపల్లె డివిజన్లో సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేస్తానని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజన్ పరిధిలో గల తహశీల్దార్ లు సిబ్బంది ఆర్డీఓకు స్వాగతం పలికారు.

అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పోలీసు అమర వీరుల త్యాగాలు అనుపమానమని చీరాల నియోజక వర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్తూపానికి నివాళులర్పించారు.

టీడీపీ సమావేశంలో కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, తదనంతర పరిణామాలు, భవిష్యత్తు గ్యారంటీ యాత్ర, తెదేపా మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడం తదితర విషయాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. నియోజకవర్గం లోని కొత్తపేటలో ఉన్న పంచాయితీ కార్యాలయం నుండి ఇంటింటికి తిరుగుతూ స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు కరపత్రాలను పంపిణీ చేసి చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని పూజలు

విశాలాంధ్ర - బాపట్ల : నవ్యాంధ్ర నిర్మాత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని త్వరగా జైలు నుండి బయటకు రావాలని నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, చర్చిలో శనివారం బాపట్ల పార్లమెంట్ తెలుగుమహిళలు ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని,నియోజకవర్గ అధ్యక్షులు హైమవతి ,పిట్లవానిపాలెం మండల తెలుగు మహిళ అధ్యక్షులు గ్లోరీ ఏనియెట్, కూచిపూడి ఝాన్సీరాణి ,మహాలక్ష్మి, రజని, ఇందు, రాజ్యలక్ష్మి, ఝాన్సీ, తెలుగు మహిళలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కాకర్స్ లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ఫైర్ క్రాకర్స్ విక్రయించేందుకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణరావు కోరారు. రెవిన్యూ, పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, పంచాయితీ, కమర్షియల్ టాక్స్ అధికారులతో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. వచ్చే నెల 4వ తేదీ లోపు మీ సేవ, గ్రామ. వార్డు సచివాలయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండి ఆధార్,పాస్‌పోర్టు ఫోటోలు, అఫిడవిట్‌తో వాణిజ్యశాకాధికారి నుంచి ఎన్‌వోసీతో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు దుఖాణాలు ఏర్పాటు చేసుకునే స్థలాలు గుర్తించాలని జనావాసాలకు దూరంగా ఉండాలన్నారు. వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ మూడు రోజులు మాత్రమే లైసెన్స్ ఉంటుందన్నారు. జిల్లాలో బాణసంచా అక్రమంగా తయారీ చేసి నిల్వ ఉంచిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

బాబు విడుదల కోసం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కర్లపాలెం : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పూర్తి ఆరోగ్యంగా జైలు నుంచి విడుదల కావాలంటూ టీడీపీ నాయకుడు మాడా బుజ్జిబాబు ఆద్వర్యంలో శనివారం నల్లమోతువారిపాలెం గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని వెన్నలకంటినగర్‌లో దేవిశరన్నవరాత్రులు సందర్భంగా లలితత్రిపుర సుందరీ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చిన అమ్మవారిని వేడుకొన్నారు.ఈ కార్యక్రమంలో గోసాని రాంబాబు, బాపట్ల ప్రభాకర్, యేసు, సంజీరావు, భావన్నారాయణ, లక్ష్మినారాయణ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలలో పోలీస్ అమర వీరులు అమర జవాన్ల స్థూపానికి మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు సభ్యులుతో కలసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తాంధ్ర మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సైనికులు దేశ సరిహద్దుల్లో ఏ విధంగా ప్రాణాలను సైతం త్యజించి పోరాడతారో అదేవిధంగా అంతర్గతంగా దేశంలో శాంతి భద్రతలు కాపాడే ప్రయత్నంలో సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను కోల్పోతున్న పోలీస్ అమర వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు. అమరులైన పోలీసులకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆశ్రయ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర- పర్చూరు: మండలంలోని నూతలపాడులో గల ఆశ్రయ వృద్ధాశ్రమంలో శనివారం అనకాపల్లికి చెందిన హెల్పింగ్ హార్ట్స్ ఫర్ నీడీ సొసైటీ వారి సహకారంతో భాస్కర్, శ్రీలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి కేక్ కట్‌చేసి భాస్కర్, శ్రీలక్ష్మిలకు శుభాకాంక్షలు తెలిపి, సొసైటీ వారికి ధన్యవాదములు తెలపారు.

చదవటం మాకిష్టం కార్యక్రమం ముగిసింది

విశాలాంధ్ర-పర్చూరు: దసరా సెల వులలో చిన్నారులకు స్థానిక గ్రంథాల యంలో నిర్వహించిన చదవటం మాకిష్టం కార్యక్రమం శనివారంతో ముగిసిందని గ్రంథపాలకుడు గుడి పాటి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్ర మం విజయవంతం చేయటానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.

'రావి'కి మాతృ వియోగం

విశాలాంధ్ర-పర్చూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు రావి రామనాధంబాబు మాతృమూర్తి సీతారావమ్మ(76) అడుసుమల్లిలో మృతిచెందారు. పార్థీవ దేహాన్ని పలువురు నేతలు సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. రామనాధంబాబు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలికి నివాళులర్పించిన వారిలో బాపట్ల ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పర్చూరు, అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిలు ఆమంచి కృష్ణమోహన్, బాచిన కృష్ణచైతన్య, రాష్ట్ర సహకార శాఖ ముఖ్య సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ప్రవాసాంధ్రులు లింగిశెట్టి రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

నాట్య కళాపీఠాన్ని సందర్శించిన కమిషనరేట్ డీపీఓ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి నాట్యం అజరామరమని, తరాలు మారినా వన్నె తగ్గని కళని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయ డిపిఓ కే శ్రీదేవి పేర్కొన్నారు. కూచిపూడిలోని పిఎస్ తెలుగు విశ్వ విద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళాపీఠంలో శనివారం నాటి, నేటి నాట్య దిగ్గజాల జీవిత విశేషాలు కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ద్వారా తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యం దశదిశల వ్యాప్తి చెందడానికి అవిరళ కృషి సలిపిన మహామహులైన నాట్యకళాకారులకు నివాళులర్పించారు. కూచిపూడి పంచాయతీ గ్రేడ్ వన్.కార్యదర్శి ఇస్లావత్ భవాని, జూనియర్ అసిస్టెంట్ ఏ.ఫణీంద్ర, శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయ పాలకులు వై.వి.ఫణి కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ రాష్ట్రం కుటిలత్వంతో, నీచ రాజకీయాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నడుపుతున్నాడే తప్ప ఈ రాష్ట్రానికి ఏ విధమైన మేలు చేయడం లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన దీక్షలు శనివారానికి 40 రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షతోటే చంద్రబాబు నాయుడు జైల్లో పెట్టడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో గోపు సత్యం, కుంచె నాని, ఇలియాస్ పాషా, వెంకన్న, తలారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఏఐటీయూసీ జెండా ఎగరేద్దాం

విశాలాంధ్ర - బల్లికురవ : ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గ్రామ గ్రామాన ఏఐటీయూసీ జెండా ఎగరవేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన బల్లికురవలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం ప్రచార కార్యక్రమంలో భాగంగా కార్మి కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడీని వ్యతిరేకిస్తూ శ్రమ జీవులకు అండగా గత 103 సంవత్సరాల నుండి నిరంతరం కార్మికులకు అండగా ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తుందన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి లక్షల కోట్ల రూపాయలు టాక్స్,ఆదాయ పను,విద్యుత్ బిల్లుల బకాయిలు రద్దు చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల పై పెట్రోల్,డీజిల్,గ్యాస్,నిత్యవసర వస్తువులు రేట్లు పెంచుతూ సామాన్యుడు ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలంటే కార్మికులంతా కలిసికట్టుగా ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకోవాలన్నారు.కార్మిక హక్కుల,మెరుగైన జీవితాలు,రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో హక్కులు సాధించి అమరులైన వారి ఆశయాల సాధన కోసం ఏఐటీయుసి జెండాను ఎగురవేయాలన్నారు. ఈ నెల 31వ తేదీన బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో 104వ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో బాపట్ల జిల్లా ఎఐటియుసి కార్యదర్శి ముస్తఫా,అద్దంకి నియోజకవర్గం ఏఐటీయూసీ కార్యదర్శి కేవీఎల్ డి ప్రసాద్,బల్లికురవ మండల ఏఐటీయూసీ కన్వీనర్ నిమ్మల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్టీయూ ఆక్రందన దీక్ష

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు వివిధ బిల్లులకు సంబంధించి పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆక్రందన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్ నుంచి కూడా అవసరానికి డబ్బులు విడుదల చేయడం లేదని చాలా దారుణమని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు, ఆర్జిత సెలవులు, పిఎఫ్, సిపిఎస్ బకాయిలు, డీఏ బకాయిలు, 11వ పిఆర్ సి బకాయిలు పెండిగ్‌లో ఉన్నాయన్నారు. అనేక సందర్భాలలో ప్రభుత్వ పెద్దలకు, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించినప్పటికీ నేటి వరకు బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉద్యోగుల పిల్లల చదువులు కోసం, పిల్లలు వివాహాల కోసం, గృహ నిర్మాణాలు, కుటుంబ అవసరాల కోసం దాచుకున్న సొమ్ము కోసం ఎదురు చూసే దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులు పట్ల వివక్షతో ఇబ్బందులుకు గురి చేస్తున్నందుకు ఆవేదనతో రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టరేట్ వద్ద ఆక్రందన దీక్షలు చేపట్టామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంజిత్ భాషకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు నర్రా సుబ్బారావు, ఉపాధ్యాయవాణి కన్వీనర్ పివి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొంతా వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ కన్వీనర్ నూర్‌భాషా సుభాని, కార్యవర్గ సభ్యులు గవిని శ్రీనివాసరావు, శివరామకృష్ణ, పరిశుద్ధరావు, నానిబాబు, చందా నరసింహారావు, సుబ్బారావు, సిపిఐ రాష్ట్ర వర్గ సభ్యులు జేబి శ్రీధర్, గూడారంకయ్య, తులసీదాస్, పులిపాటి రాజు, శ్రీనివాసరావు,ఆదినారాయణ, సాయిరాం, తోటకూర వీరాంజనేయులు, పీలా శివ, చంద్రయ్య, మధుబాబు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ అధికారి అమరులు ఎస్సార్ శంకరన్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆదర్శ ఉన్నత అధికారి అమరులు ఎస్ఆర్ శంకరన్ రాష్ట్ర ప్రజల మనస్సుల్లో స్థానం పొందారని సీపీఐ సీనియర్ నాయకులు జేబి శ్రీధర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాట్లు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బడుగు జీవుల, స్త్రీ సంక్షేమం అనే పథకానికి అర్థం చెప్పి అమలులోకి తెచ్చిన మహా మేధావి శంకరన్ అన్నారు. బ్రాహ్మణ కులంలో జన్మించి తన వ్యక్తిగత జీవిత శైలిలో నిరాడంబరతను ఆచరించి మానవత ఉన్నత విలువలు కాపాడుకున్న ధ్యానజీవి అన్నారు. బాపట్ల నూతన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ విగ్రహం ఏర్పాటు చేసినజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు సిపిఐ పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి తరుపున శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలో పూలమాలలతో ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణకు మందులు పంపిణీ

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని నల్ల మోతువారిపాలెం రాధా కృష్ణనగర్ రైతు భరోసా కేంద్రం దగ్గర గ్రామం లోని రైతులకు సామూ హిక ఎలుకల నివారణకు మందులులను ఎంపీటీసీ సభ్యులు తాంధ్ర సాంబశివరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాంధ్ర మాట్లాడుతూ వ్యవసాయంలో వచ్చిన మార్పులపై రైతులు అందరూ సామూహికంగా ఎలుకల నివారణకు మందులు వాడాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రలలో ప్రభుత్వం ద్వారా ఇస్తున్న ఎలుకల నివారణ మందులు కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. రైతులు పంట పొలాలలో వచ్చే తెగుళ్లను కూడా ఎప్పటికప్పుడు సచివాలయంలో అందుబాటులో ఉన్న అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కి తెలిపి సరైన మందులు వాడుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అగ్రికల్చరల్ అసిస్టెంట్ నవ్యశ్రీ, కార్తీక్, మోహన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : వరి పంట పొట్ట దశలో ఉన్నప్పుడు ఎలుకలు పంటను ఆశించి వాటిని ధ్వంసం చేయడం జరుగుతుందని వాటి నిర్మూలనకు రైతులందరూ సామూహిక ఎరుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్ అన్నారు శనివారం ఆయన మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ ముందును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ముందును వరినూకలో కాని బియ్యంలో గాని నూనెతో కలిపి ఎలుక బొరియాలలో పెట్టినట్లయితే అవి తిన్న ఎలుకలు దాహం కోసం బయటకు వచ్చి చనిపోతాయన్నారు. ఈ మందును 96 గ్రాముల నూకలు రెండు గ్రాములు కలిపి పొట్లాలుగా కట్టి బొరియాలలో పెట్టాలన్నారు. ఇలా మూడు దశలలో ఈ ముందును వాడి ఎలుకలను సామూహికంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు .గ్రామ వ్యవసాయ సహాయకులు .ప్రజాప్రతినిధులు. రైతులు పాల్గొన్నారు.

స్పందన తాత్కాలిక రద్దు

విశాలాంధ్ర - బాపట్ల : విజయదశమి పండుగ సందర్భంగా ఈనెల 23వ తేదీన సోమవారం స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీలు ఇవ్వడానికి జిల్లాలోని ప్రజలు ఎవరూ బాపట్లకు రావద్దని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కరణం వెంకటేష్‌కు స్వల్పగాయాలు

విశాలాంధ్ర - చీరాల : చీరాల మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో మాజీ జడ్పీటీసీ బోయిన వెంకన్న మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు బోయినవారిపాలెం వెళుతుండగా రైల్వే గేటు వేసి ఉండటంతో ఆలస్యం అవుతుందని కారు దిగి రైల్వే గేటు దాటి అదే గ్రామానికి చెందిన కార్యకర్త వాహనంపై పరామర్శించేందుకు వెళుతున్న కరణం వెంకటేష్ ను ఎదురుగా వస్తున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొనింది.ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం రోడ్డుపై జారీ పడడంతో వెంకటేష్ కాలు, చేయికి స్వల్ప గాయాలైయ్యాయి.ఒంగోలు సంఘమిత్ర హాస్పటల్ కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.